సాక్షి
మంచిర్యాల
శనివారం : 16 : ఆగస్టు : 2025


విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న హర్కర వేణుగోపాల్‌రావు, కుమార్ దీపక్

అభివృద్ధి, సంక్షేమంలో అగ్రగామి


ప్రసంగిస్తున్న హర్కర వేణుగోపాల్‌రావు


స్వయం సహాయక సంఘాలకు చెక్కు పంపిణీ


జెండాకు వందనం చేస్తున్న ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, జిల్లా ఉన్నతాధికారులు

- ఉత్తర తెలంగాణలో జిల్లాకు ప్రథమస్థానం
- అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం
- రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు
- ఘనంగా స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఉత్తర తెలంగాణలో మంచిర్యాల జిల్లా ప్రథమ స్థానంతో దూసుకెళ్తోందని, అభివృద్ధి, సంక్షేమంలో అగ్రగామిగా నిలిచిందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో 79వ స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వందనం సమర్పించారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి ప్రసంగించారు. ఆయన మాటల్లోనే..

సన్నబియ్యం సరఫరా

ప్రజా ప్రభుత్వం ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించి రూ.13వేల కోట్ల వ్యయంతో 3.10కోట్ల మందికి అందిస్తోంది. జిల్లాలో 2,47,923 మంది కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ చేశాం. పోర్టబులిటి విధానం ద్వారా రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోనైనా రేషన్ బియ్యం తీసుకునే వీలు కల్పించాం.

కొత్త రేషన్‌కార్డులు

జూలై 14నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించాం. పదేళ్ల తర్వాత పేదలకు రేషన్‌కార్డులు చేతికందాయి. జిల్లాలో అర్హులైన లబ్ధిదారులు 24,079 నూతన రేషన్‌కార్డులు అందించడంతోపాటు పాత కార్డుల్లో పిల్లల పేర్లు చేర్పులకు 41,677 దరఖాస్తులు పరిశీలించి 53,040మందిని చేర్చాం.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు..

తొలి విడతగా ప్రతీ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశాం. అన్ని శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇళ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్లు వెచ్చిస్తున్నాం. జిల్లాలో 10,377 ఇళ్లు మంజూరు కాగా 6,373 ఇళ్లు మార్కవుట్, 1,870 ఇళ్లు బేస్‌మెంటు, 164 గోడలు, 24 స్లాబ్ నిర్మాణ స్థాయిలో ఉన్నాయి. లబ్ధిదారుల ఖాతాల్లో రూ.15.49కోట్లు జమ చేశాం. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును ఈ ఏడాది మార్చి 17న అసెంబ్లీలో ఆమోదించింది. సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీల్లో 59 ఉపకులాలను మూడు గ్రూపులుగా విభజించి గ్రూప్–1లో 15, గ్రూప్–2లో 18, గ్రూప్–3లో 26 కులాలను చేర్చాం.

రాజీవ్ ఆరోగ్యశ్రీకి పూర్వవైభవం

రాజీవ్ ఆరోగ్యశ్రీ కాంగ్రెస్ బ్రాండ్ స్కీం. మసకబారిన ఈ పథకానికి పూర్వవైభవం తెచ్చాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచాం. జిల్లాలో 9,120మంది పేదలు చికిత్స పొందారు. ఇందుకు ప్రభుత్వం రూ.14.15కోట్లు ఖర్చు చేసింది.

ఆడబిడ్డలకు అండగా..

ప్రజా ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత రవాణా సౌకర్యం కల్పించింది. ఆడబిడ్డలకు ఈ పథకం ద్వారా రూ.6,790 కోట్లు ఆదా అయ్యింది. జిల్లాలో ఉచిత రవాణా ద్వారా 2,24,03,654 మంది మహిళలకు లబ్ధి చేకూరింది. రూ.500కే వంట గ్యాస్ సరఫరా ద్వారా మహిళలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించి జిల్లాలో 1,22,837 మంది లబ్ధిదారులకు రూ.14.63 కోట్లు రాయితీ మంజూరు చేశాం.

ఇందిరా మహిళా శక్తి..

రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టింది. జిల్లాలో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటులో భాగంగా దండేపల్లి మండలంలో శంకుస్థాపన చేసి మరొకటి ఏర్పాటుకు మందమర్రి మండలాన్ని గుర్తించాం. మహిళలకు పెట్రోల్‌బంక్‌లు, మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ, ఇందిరా శక్తి స్టాళ్లు, మీసేవ కేంద్రాలను ప్రారంభించింది.


విద్యార్థిని నృత్యం


శ్రీశార్వాణి కుచిపూడి నృత్యాలయ బృందం

గృహజ్యోతి ద్వారా ఉచిత విద్యుత్..

200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా ద్వారా జిల్లాలో ప్రతీ నెల లక్ష నివాసాలకు ఉచిత విద్యుత్ అందిస్తూ 1,25,759 మంది వినియోగదారులకు నెలకు రూ.4.96 కోట్లు ఖర్చు చేస్తూ ఇప్పటివరకు రూ.71.38 కోట్లు లబ్ధి చేకూర్చింది.

భూభారతి..

భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టి రైతులకు అనుకూలంగా అప్పీలు వ్యవస్థను పొందుపర్చింది. జిల్లాలో ప్రతీ మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించగా వచ్చిన 51,503 దరఖాస్తుల్లో 26,744 దరఖాస్తులు వివిధ స్థాయిల్లో పరిశీలనలో ఉన్నాయి.

విద్యారంగం బలోపేతం

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పుకు శ్రీకారం చుట్టాం. జిల్లాలో 510 ప్రభుత్వ పాఠశాలల్లో పనులు పూర్తి చేసి మిగతా వాటిల్లో పురోగతిలో ఉన్నాయి. 688 పాఠశాలలకు స్కూల్ ఫెసిలిటీ గ్రాంటు రూ.1,64,30,000 ఐదు నెలలకు ఇచ్చాం. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల విద్యార్థులకు గతంలో ఎన్నడూ లేని విధంగా 40 శాతం డైట్, 200 శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచి నూతన మెనూ అమలు చేస్తూ పౌష్టికాహారం అందించి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం..

మున్సిపాలిటీలు..

మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌తోపాటు ఐదు బల్దియాల్లో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. మంచిర్యాలలో రూ.10.22 కోట్లతో రాష్ట్రంలోనే అత్యుత్తమంగా మహాప్రస్థానం నిర్మించాం. అమృత్ 2.0 పథకం కింద బల్దియాలకు రూ.275 కోట్లు మంజూరు చేసి పనులు పురోగతిలో ఉన్నాయి.

వైద్య, ఆరోగ్య శాఖ భవనాల నిర్మాణం

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.300 కోట్లు మంజూరు చేయగా పనులు పురోగతిలో ఉన్నాయి. రూ.23.75 కోట్లతో క్రిటికల్ కేర్ ఆసుపత్రి భవన నిర్మాణం, నర్సింగ్ కళాశాల, వైద్య విద్య కోసం రూ.40 కోట్లతో భవన నిర్మాణం, రూ.3.50 కోట్లతో మందుల నిల్వ గిడ్డంగి నిర్మించాం. గుడిపేటలో రూ.216 కోట్ల వ్యయంతో అధునాతన వైద్య కళాశాల నిర్మాణం జరుగుతుంది. కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ ఏ.భాస్కర్, బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్‌సింగ్, ఏసీపీ ప్రకాష్, సబ్ కలెక్టర్ మనోజ్, ఐఎన్‌టీయూసీ నాయకుడు జనక్‌ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ..

దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు రుణమాఫీ గత ఏడాది ఆగస్టు 15న ప్రారంభించాం. రాష్ట్రంలో 25.35లక్షల మంది రైతులకు రూ.20,616 కోట్లు రుణమాఫీ చేశాం. ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా, గత పాలకుల పాపాలు శాపాలై వెంటాడుతున్నా రైతుల విషయంలో రాజీ పడలేదు. జిల్లాలో రైతు బీమా పథకం కింద 83,114మంది రైతులను చేర్చి ఇప్పటివరకు 347మంది రైతులకు రూ.5లక్షల చొప్పున రూ.17.35కోట్లు అందజేశాం. సన్నధాన్యాన్ని రూ.500 బోనస్ చెల్లించి సేకరిస్తూ 48గంటల్లోనే డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవసాయ చరిత్రను తిరగరాసి అన్నదాతల సంక్షేమానికి రూ.1.13లక్షల కోట్లు ఖర్చు చేశాం. రైతు భరోసా కింద ఎకరాకు రూ.12వేల పెట్టుబడి సాయం జూన్ 16న ప్రారంభించి తొమ్మిది రోజుల్లోనే రూ.9వేల కోట్లు రైతుల ఖాతాల్లో వేశాం. జిల్లాలో గత యాసంగి సీజన్‌కు 1,15,868మంది రైతులకు రూ.92.85కోట్లు, ప్రస్తుత వానాకాలం పంటకు 1,52,162 మంది రైతులకు రూ.198.13కోట్లు పెట్టుబడి సాయం అందించాం.

అలరించిన విద్యార్థుల నృత్యాలు

స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో వివిధ పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. దేశభక్తి గీతాలపై చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులు విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు.


మందమర్రి టీఎస్ మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రదర్శన


నృత్యం చేస్తున్న నందిని డ్యాన్స్ అకాడమీ బృందం


స్టాల్స్‌ను పరిశీలిస్తున్న హర్కర వేణుగోపాల్‌రావు, కుమార్ దీపక్, అధికారులు

న్యూస్‌రీల్

గూడెంలో భక్తుల సందడి


సత్యనారాయణ వ్రతాలు నోముతున్న భక్తులు

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తుల సందడి నెలకొంది. సమీప గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం గుట్టపై సత్యదేవుణ్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు దంపతులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు నోముకున్నారు.

వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలి


ర్యాలీలో వెంకటేశ్వర్‌గౌడ్, నాయకులు

మంచిర్యాలటౌన్: దేశ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించాలని, వికసిత్ భారత్ దిశగా మోదీ చేస్తున్న కృషిలో ప్రజలు భాగస్వాములు కావాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయం నుంచి తిరంగా బైక్ ర్యాలీని పట్టణ వీధుల గుండా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు రఘునాథ్ వెరబెల్లి, అమిరిశెట్టి రాజ్‌కుమార్, సత్రం రమేశ్, గాజుల ముఖేశ్‌గౌడ్, పట్టి వెంకటకృష్ణ, మోటపలుకుల తిరుపతి, బియ్యాల సతీశ్‌రావు, ఎనగందుల కృష్ణమూర్తి, బొలిశెట్టి అశ్విన్, కోడి రమేశ్, ముదాం మల్లేశ్, రంగ శ్రీశైలం, బోయిని హరికృష్ణ, జయరామరావు, సప్పిడి నరేశ్, కర్రె లచ్చన్న, కర్రె చక్రి, బోయిని దేవేందర్, కోడి సురేశ్ పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు సాధించిన టీబీజీకేఎస్


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న దివాకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు చరిత్రలో నిలిచిపోయే హక్కులను టీబీజీకేఎస్ సాధించిందని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన నస్పూర్ కాలనీలో టీబీజీకేఎస్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచ్ ఉపాధ్యక్షులు బండి రమేష్ పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం దివాకర్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మికుల సమస్యలను పరిష్కరించామని, ఏ సమస్య వచ్చినా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ తక్షణమే స్పందించి ప్రయోజనాలు చేకూర్చారని తెలిపారు. కారుణ్య ఉద్యోగాలు ఇప్పించారని అన్నారు. టీబీజీకేఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు యస్.విజిత్‌రావు, యూనియన్ కేంద్రం ఉపాధ్యక్షుడు నూనె కొమురయ్య, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, జాయింట్ సెక్రెటరీ సత్తయ్య, మాజీ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, నాయకులు అన్వేష్‌రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, నాయకులు మేరుగు పవన్, బేర సత్యనారాయణ, అత్తి సరోజ, వంగ తిరుపతి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో జెండావిష్కరణ


వందనం చేస్తున్న సుమన్, దివాకర్‌రావు

నస్పూర్: పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర నాయకులు నడిపల్లి విజిత్‌రావు, పట్టణ అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, మాజీ కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్త స్థాయి నుంచే మంత్రినయ్యా

- మంత్రి గడ్డం వివేక్‌వెంటకస్వామి
- కాంగ్రెస్ పార్టీలో పలువురి చేరిక


కండువా కప్పుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

చెన్నూర్: తాను కార్యకర్త స్థాయి నుంచే మంత్రి స్థాయికి చేరుకున్నానని, చెన్నూర్‌ను పాత కొత్త అందరం కలిసి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెన్నూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ సాధనబోయిన కృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నవాజ్, మాజీ కౌన్సిలర్ తుమ్మ రమేశ్, కారెంగుల శ్రావణ్ తదితరులకు మంత్రి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంతోపాటు పార్టీ బలోపేతమే లక్ష్యంగా కృషి చేయాలని, రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకే పార్టీలో చేరికలు నిర్వహించామని తెలిపారు. తనతో పని చేసిన పాత నాయకులు, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడ్డదని, అందరినీ సమానంగా చూస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులై వచ్చిన వారిని పార్టీలో చేర్చుకుంటామని తెలిపారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా క్యాంప్ కార్యాలయానికి తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు, పట్టణ అధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఫయాజ్, నాయకులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు

చెన్నూర్‌రూరల్: యూరియా కోసం రైతులు అనేక పాట్లు పడుతున్నారు. మండలంలోని ముత్తరావుపల్లి గ్రామంలో ఉన్న డీసీఎంఎస్ కేంద్రంలో శుక్రవారం యూరియా రావడంతో రైతులు బారులు తీరారు. పట్టా పాసు పుస్తకాలు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో వచ్చి గంటల తరబడి వేచి చూశారు. ఉన్నతాధికారులు స్పందించి యూరియా బస్తాలు అందించాలని రైతులు కోరుతున్నారు.


డీసీఎంఎస్ కేంద్రం ఎదుట రైతులు

సమరయోధుల ఆశయ సాధనకు కృషి


జాతీయజెండాకు వందనం చేస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

మంచిర్యాలక్రైం: స్వాతంత్య్ర సమరయోధుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ అన్నారు. శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా కమిషనరేట్‌లో స్వాతంత్య్ర సమరయోధులు, మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాయుధ పోలీసు గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన ఉత్తమ పోలీసు అధికారులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీపీలు రమేష్, మల్లారెడ్డి, శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మువ్వన్నెల రెపరెపలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలో శుక్రవారం స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మువ్వెన్నెల జెండాలు రెపరెపలాడాయి. స్థానిక డీసీపీ కార్యాలయంలో డీసీపీ ఎగ్గడి భాస్కర్, ఏసీపీ కార్యాలయంలో ఏసీపీ ప్రకాష్ జాతీయ జెండాలను ఆవిష్కరించారు. సీఐ ప్రమోద్‌రావు, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

- జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.వీరయ్య జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితమే నేటి స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలని కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి ఏ.నిర్మల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్, న్యాయవాదులు పాల్గొన్నారు.
- జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్, సర్కిల్ కార్యాలయాల్లో జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి నందగోపాల్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. సీఐ కార్యాలయంలో సీఐ గరువయ్య జాతీయ జెండను ఎగురవేశారు.
- జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో జిల్లా అటవీ శాఖ సీఎఫ్ఓ శాంతరామ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్, ఎఫ్‌డీవోలు డీఆర్‌వోలు, ఎఫ్ఆర్‌వోలు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.
- అగ్నిమాపక శాఖ కార్యాలయంలో జిల్లా ఫైర్ అధికారి భగవాన్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి వందన సమర్పణ చేశారు. ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.


కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.వీరయ్య


గౌరవ వందనం స్వీకరిస్తున్న డీసీపీ భాస్కర్


మట్లాడుతున్న సీఎఫ్ఓ శాంతరామ్

క్లుప్తంగా

భీమారంలో తలకిందులుగా జెండా



తలకిందులుగా జెండా ఎగురవేస్తున్న తహసీల్దార్

భీమారం: మంచిర్యాల జిల్లా భీమారం తహసీల్దార్ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. శుక్రవారం ఉదయం 9గంటలకు తహసీల్దార్ సదానందం తలకిందులుగా ఉన్న జాతీయ జెండా ఎగురవేశారు. ఆ తర్వాత అందరూ జాతీయ గీతం ఆలపిస్తుండగా జెండా తలకిందులుగా ఎగిరినట్లు పక్కనున్న వ్యక్తి తెలుపగా వెంటనే కిందికి దించారు. సరిచేసి మరోసారి జెండాను ఎగురవేశారు.

ముగ్గురికి జైలు శిక్ష

చెన్నూర్: మండలంలోని లంబాడిపల్లి గ్రామానికి చెందిన ముగ్గురికి స్థానిక మున్సిఫ్ కోర్టు సివిల్ జడ్జి పర్వతపు రవి జైలు శిక్ష విధించినట్లు ఎక్సైజ్ సీఐ హరి తెలిపారు. గుడుంబా తయారీ కేసులో పట్టుబడిన నాగావతు రాజేశ్, బానోతు సావిత్రి, రాజేశ్వరి కోర్టుకు హాజరు కాకపోవడంతో శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.జీ మేరకు శుక్రవారం ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణాపూర్‌కు చెందిన కుక్కల రాకేశ్ (21) ఇద్దరు స్నేహితులతో కలిసి నిజామాబాద్‌కు వెళ్లి తిరిగి రామకృష్ణాపూర్‌కు కారులో వస్తుండగా హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని వేంపల్లి శివారులోగల కల్వర్టును అతివేగంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రాకేశ్‌కు తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యా యి. మృతుడికి వివాహం కాలేదు. అతని తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వ్యాన్



స్తంభాన్ని ఢీకొట్టిన వాహనం

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలోగల మసీదు ఎదురుగా నిర్మల్–ఖానాపూర్ ప్రధాన రహదారిపై ఉన్న సెంట్రల్ లైటింగ్ స్తంభాన్ని శుక్రవారం వేకువజామున నిర్మల్ నుంచి మెట్‌పల్లి వైపు అరటిపండ్ల లోడుతో వేగంగా వెళ్తున్న డీసీఎం వాహనం ఢీకొట్టింది. దీంతో గద్దె కూలి స్తంభం కిందపడింది. డీసీఎం వాహనం ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

ఉత్తములకు ప్రశంసాపత్రాలు



కిషన్, డీఆర్డీవో

మంచిర్యాలఅగ్రికల్చర్: 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో శుక్రవారం మంచిర్యాల కలెక్టరేట్ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉత్తమ సేవలకు గుర్తింపు లభిస్తుందని, విధి నిర్వహణలో ప్రతీ ఉద్యోగి, సిబ్బంది నిక్కచ్చిగా ఉండాలని తెలిపారు. వివిధ శాఖలకు చెందిన 169 మందికి అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.



శౌర్యచక్ర అందుకున్న ఆర్ఎస్సై ఆర్.శ్రీహరి | ఏఆర్ఎస్సై ప్రకాశ్, బెల్లంపల్లి | ఏఎస్సై సుధాకర్, లక్సెట్టిపేట



ఎస్.యాదయ్య, డీఈవో | రాజేశ్వరి, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి | శంకర్, జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి | ఎం.కృష్ణమూర్తి, డీపీఆర్‌వో | దుర్గాప్రసాద్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ | డీ.మధుసూదన్, సూపరింటెండెంట్ | ప్రసాద్, పీవో, ఎన్‌సీడీ, డీఎంహెచ్‌వో | శ్రీహరి, ఆర్డీవో ఆఫీస్, మంచిర్యాల



కే.దిలీప్‌కుమార్, ఇంటెలిజెన్స్ పీసీ | ఎం.రాజన్న, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై | ఎం.సురేష్, సీనియర్ అసిస్టెంట్ | హర్షన్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ | ఈ.మల్లిఖార్జున్, తహసీల్దార్, చెన్నూర్ | ఎల్.కృష్ణ, తహసీల్దార్, బెల్లంపల్లి | జే.లచ్చన్న, ఆఫీస్ సబార్డినేట్ | ఎస్.ఏసయ్య, గిర్దావార్, హాజీపూర్ | అంజయ్య, నాయబ్ తహసీల్దార్, కాసిపేట | మాంతయ్య, సీనియర్ అసిస్టెంట్, కన్నెపల్లి | సత్యనారాయణ, ఎంపీడీవో, జైపూర్



కే.సరోజ, ఎంపీడీవో లక్సెట్టిపేట | ఎండీ.మోయిజుద్దీన్, రికార్డ్ అసిస్టెంట్ జెడ్పీపీ | రాజు, మున్సిపల్ కమిషనర్, క్యాతన్‌పల్లి | సీహెచ్.వనిత, జూనియర్ అసిస్టెంట్ | అస్మితరెడ్డి, డీఈఈ మంచిర్యాల | ఎస్.భాస్కర్, ఏఎంసీ బెల్లంపల్లి | శాంకరి, డీఆర్‌పీ కాసిపేట | కే.నరేష్, ఏపీవో ఇంచార్జి, నెన్నెల | భాగ్యవతి, ఏడీసీడీవో మంచిర్యాల | జీ.కుమార్, ఏఈఈ | ఎం.వేణుగోపాల్, ఏసీఎస్‌వో



సిహెచ్.స్రవంతి, డీటీ | జే.సుజాత, జూనియర్ అసిస్టెంట్ | ఎం.శ్రీనివాస్, జేపీవో | దయాకర్, ఎఫ్ఆర్‌వో కుష్ణపల్లి రేంజ్ | ప్రమోద్‌రావు, సీఐ మంచిర్యాల | కే.శశిధర్, సీఐ మందమర్రి | ఎన్.దేవయ్య, సీఐ తాండూర్ | డి.రమణమూర్తి, సీఐ లక్సెట్టిపేట | జీ.రాజశేఖర్, ఎస్సై రామకృష్ణాపూర్ | జీ.సురేష్, ఎస్సై లక్సెట్టిపేట | శ్యాంపటేల్, ఎస్సై చెన్నూర్



సిహెచ్.తిరుపతి, ఎస్సై మంచిర్యాల | జితేందర్‌సింగ్, ఎస్సై సీసీసీ నస్పూర్ | ఎండీ.సలీం, ఏఎస్సై, డీసీపీ ఆఫీస్ మంచిర్యాల | టి.నరేష్, పీసీ సైబర్ క్రైం బ్రాంచ్ | కే.పద్మనాభం, పంచాయతీ సెక్రెటరీ | డి.ఉషారాణి, పీసీ, సీసీసీ నస్పూర్ | రిజ్వాన్, ఎస్‌బీ కానిస్టేబుల్ | వి.సరిత, సూపర్‌వైజర్ ఐసీడీఎస్ | సత్యనారాయణమూర్తి, సీహెచ్, డీఈవో కార్యాలయం | జమీరుద్దీన్, జేపీవో, డీపీవో కార్యాలయం | నరేందర్‌గౌడ్, డీపీఎం, డీపీవో కార్యాలయం



సంధ్యారాణి, జీటీఎం, డీపీవో కార్యాలయం | జీ.శ్రీనివాస్, ఎంపీపీ కన్నెపల్లి | వీ.ప్రసాద్‌రావు, ఎస్‌పీవో, డీపీవో కార్యాలయం | బి.అనిత, ఏడీఏ, మంచిర్యాల | జనార్ధన్, డీఆర్‌పీ మంచిర్యాల | రవీందర్‌రావు, ఏఆర్ డీసీవో ఆఫీస్ | డి.ఉషారాణి, జూనియర్ సూపరింటెండెంట్ | సింధూర, మెడికల్ ఆఫీసర్ జైపూర్ | కే.రజిత, వాలంటరీ | రాజేశ్వరి, వాలంటరీ | ఎం.రేష్మా, సీడీపీవో, లక్సెట్టిపేట

భార్యతో గొడవపడ్డందుకు చితకబాదిన ఎస్సై!

- ఉన్నతాధికారులకు బాధితుడి ఫిర్యాదు

వేమనపల్లి: భార్యతో గొడవపడ్డందుకు తనను ఎస్సై చితకబాదాడని మండలంలోని సుంపుటం గ్రామానికి చెందిన అల్గం కిష్టయ్య ఆరోపించాడు. ఈ మేరకు ఎస్సైపై ఆరే కుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి, పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేశంతో కలిసి సీపీ, డీసీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సుంపుటం గ్రామానికి చెందిన అల్గం కిష్టయ్య నాలుగేళ్ల క్రితం నీల్వాయి కొత్త కాలనీకి చెందిన భారత ప్రమీలను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. ఈ క్రమంలో ప్రమీల పుట్టింటికి వెళ్లడం, గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించిన అనంతరం తిరిగి కాపురానికి రావడం జరుగుతుండేది. 20 రోజుల క్రితం అనారోగ్యంతో ప్రమీల పుట్టింటికి వెళ్లింది. దీంతో కిష్టయ్య గత ఆదివారం ఆమె వద్దకు వెళ్లి కాపురానికి రావాలని గొడవ పడ్డాడు. దీంతో



బాధితుడు కిష్టయ్య

ప్రమీలతోపాటు ఆమె తల్లిదండ్రులు నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై సురేశ్ భార్యాభర్తలకు కౌన్సిలింగ్ చేశాడు. అయితే గ్రామానికి చెందిన పీఏసీఎస్ చైర్మన్ కుబిడె వెంకటేశ్ ద్వారా రూ.10వేలు ఇవ్వాలని ఎస్సై తనను డిమాండ్ చేసినట్లు కిష్టయ్య ఆరోపించాడు. డబ్బులు ఇవ్వకపోవడంతో తన భార్య, అత్తమామలు, మరికొందరి ముందే ఎస్సై తనను రోకలిబండతో తీవ్రంగా కొట్టాడని కన్నీటిపర్యంతమయ్యాడు. ఈ విషయమై మూడురోజుల క్రితం రూరల్ సీఐ బన్సీలాల్, ఏసీపీ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. శుక్రవారం రామగుండం సీపీ, మంచిర్యాల డీసీపీకి పోస్టు ద్వారా ఫిర్యాదు కాపీ పంపించినట్లు పేర్కొన్నాడు. ఎస్సై సురేశ్‌తో తనకు ప్రాణహాని ఉందని వాపోయాడు. తనపై విచక్షణారహితంగా దాడికి పాల్పడిన ఎస్సైతోపాటు ఇద్దరు కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.

'హమాలీల సమస్యలు పరిష్కరిస్తా'

బెల్లంపల్లి: హమాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గడ్డం వినోద్ తెలిపారు. శుక్రవారం బెల్లంపల్లిలోని అగర్వాల్ భవన్‌లో తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహాసభ నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హమాలీ సంఘం నాయకులను సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లి సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం మాట్లాడుతూ.. హమాలీ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. అసంఘటిత కార్మికుల మాదిరిగానే పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం హమాలీలు పోరాటాలు సాగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అంతకుముందు బజారు ఏరియా ప్రాంతం నుంచి పుర వీధుల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గెల్లి రాజలింగు, నియోజకవర్గ అధ్యక్షులు, హమాలీలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

పాటాగూడలో తొలిసారి ఎగిరిన జెండా

కెరమెరి(ఆసిఫాబాద్): మండలంలోని పాటాగూడ గ్రామంలో తొలిసారి జాతీయ జెండా రెపరెపలాడింది. ఇది మారుమూల గ్రామం కావడంతో ఎలాంటి రవాణా సౌకర్యం లేదు. జోడేఘాట్‌కు వెళ్లే ప్రధాన రోడ్డు నుంచి ఐదు కిలోమీటర్ల దూరంలోని మారుమూల ప్రాంతంలో ఉంటుంది. అప్పుడప్పుడు ప్రైవేట్ వాహనాలు వెళ్తుంటాయి. అవి కూడా వెళ్లని పక్షంలో వారికి కాలినడకే శరణ్యం. ఆ గ్రామంలో ఇప్పటివరకు బడి, అంగన్‌వాడీ కేంద్రం లేదు. దీంతో ఇప్పటివరకు జెండా ఎగురవేయలేదు. ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా చొరవతో ఇటీవల గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాల ప్రారంభించారు. ఇందులో 14 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. శుక్రవారం పాఠశాలలో సీఆర్టీ చంద్రకళ త్రివర్ణపతాకం ఎగురవేశారు. దీంతో గిరిజనులు హర్షం వ్యక్తంజేశారు.



జెండా ఎగురవేస్తున్న సీఆర్టీ చంద్రకళ

గిరిజనుల అభివృద్ధికి నిరంతర కృషి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- ఘనంగా పంద్రాగస్టు వేడుకలు

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో పంద్రాగస్టు వేడుకలు నిర్వహించారు. ముందుగా పీవో పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి జాతీయ జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ఐటీడీఏ ద్వారా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఏజెన్సీ ప్రాంతంలో విద్య, వైద్యం, అభివృద్ధిపై దృష్టి సారించినట్లు చెప్పారు. 934 ప్రాథమిక పాఠశాలల్లో 12,017 మంది విద్యార్థులు చదువుతుండగా 1,449 మంది ఉపాధ్యాయులు బోధిస్తున్నట్లు తెలిపారు. 133 ఆశ్రమ పాఠశాలల్లో 31,749 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి పెంచిన చార్జీల ప్రకారం నూతన ఆహార మెనూ అమలు చేస్తూ నాణ్యమైన ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో నాలుగు మినీ బాలికల గురుకులాలు, నాలుగు ఏకలవ్య పాఠశాలలు (కో–ఎడ్యుకేషన్), ఎనిమిది అప్‌గ్రేటెడ్ బాలికల జూనియర్ కళాశాలలు, నాలుగు అప్‌గ్రేటెడ్ జూనియర్ కళాశాలలు, ఒక బాలుర జూనియర్ కళాశాల, ఒక బాలికల జూనియర్ కళాశాల, రెండు మహిళా డిగ్రీ కళాశాలలు, ఒక పురుషుల డిగ్రీ కళాశాల ఉన్నట్లు తెలిపారు. గురుకులాల్లో 11,114 మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 32 పీహెచ్‌సీలు, 186 ఆరోగ్య ఉపకేంద్రాలు, ఎనిమిది సామాజిక ఆరోగ్య కేంద్రాలుండగా వీటి ద్వారా గిరిజనులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. డయాలసిస్ సెంటర్ ద్వారా కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులకు సేవలందిస్తున్నట్లు చెప్పారు. ఈ సంవత్సరం ఇప్పటివరకు 42 మందికి చికిత్స అందించినట్లు తెలిపారు. భూ బదలాయింపు చట్టం కింద ఈ సంవత్సరం 25 కేసులు నమోదు చేసి 12 పరిష్కరించినట్లు పేర్కొన్నారు. మిగతా 13 కేసులు విచారణలో ఉన్నట్లు తెలిపారు. జీసీసీ ద్వారా ఉమ్మడి జిల్లాలో గిరిజన సహకార సంస్థ, ఐటీడీఏ ఆధ్వర్యంలో 17 పెట్రోల్ పంపులు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపగా, మంజూరైన 11 పెట్రోల్ పంపులను ప్రారంభించి నిరుద్యోగ గిరిజన యువతీయువకులకు ఉపాధి కల్పించినట్లు పేర్కొన్నారు. మగతా ఆరు పంపులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ.. ప్రజాప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గిరిజన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏవో దామోదరస్వామి, ఏడీఎంహెచ్‌వో మనోహర్, పీహెచ్‌వో సందీప్, పీవీటీజీ ఏపీవో మనోహర్, డీపీవో ప్రవీణ్, అధికారులు, సిబ్బంది, ఆశ్రమ, గురుకుల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జెండాకు వందనం చేస్తున్న పీవో ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే బొజ్జు




నృత్యం చేస్తున్న విద్యార్థినులు

అభినవ పోతన.. వరదన్న

- కీర్తి గాంచిన సాహితీ కిరిటీ
- సాహిత్యం, రాజకీయం రెండు రంగాల్లో పేరొందిన కవి
- నేడు వానమామలై జయంతి

చెన్నూర్: తెలుగు రాష్ట్రాల్లో సాహితీ రంగంలో వానమామలై వరదాచార్యులు కీర్తి గడించారు. ఓ వైపు సాహిత్యంలో, మరోవైపు రాజకీయంలో రాణించా రు. వరదన్న చేతి నుంచి జాలు వారిన రచనలు ఉ మ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కీర్తి, ప్రతిష్టలు తెచ్చిపెట్టాయి. వరదాచార్యులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎమ్మెల్సీగా పని చేశారు. నేడు వరదా చార్యుల జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..



వానమామలై వరదాచార్యులు

జననం.. విద్యాభ్యాసం

వరదాచార్యులు వరంగల్ జిల్లా మడికొండలో 16 ఆగస్టు 1912లో సీతాంబ, బక్కయ్యశాస్త్రి దంపతులకు జన్మించారు. తండ్రి బక్కయ్యశాస్త్రి చెన్నూర్‌లో ఉపాధ్యాయునిగా పని చేశారు. ఇక్కడే స్థిర నివాసం ఏర్పర్చుకున్నారు. వరదాచార్యులకు చదువు అబ్బలేదు. ఆయన సహజ కవి. 13వ ఏటా పద్యాలు, కవితలు, రచనలు ప్రారంభించారు. డిగ్రీలు లేని పండితుడు కావడంతో అప్పటి హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా నిజామాబాద్‌లోని దోమకొండ జనతా కళాశాలకు సాంస్కృతిక కార్యక్రమ నిర్వాహకుడిగా నియమించారు. అనంతరం వానమామలై ఆంధ్ర సారస్వత పరిషత్‌లో విశారద రాసి ఉత్తీర్ణులయ్యారు. వరదాచార్యులు రాసిన 'మణిమాల' విశారద పరీక్షలో పాఠ్యాంశంగా ఉంది. అది చదివే పరీక్ష రాశారు. బాలల కోసం అనే బుర్ర కథలు, నాటికలు రచించారు. దోమకొండ నుంచి చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు బదిలీ చేయించుకుని 1961 నుంచి 1972 వరకు విధులు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు.



వరదాచార్యులు కాలికి అప్పటి ప్రధాని పీవీ గండపెండేరం తొడుగుతున్న దృశ్యం

రాజకీయ ప్రస్థానంలో..

18 ఏళ్ల పాటు అధ్యాపకునిగా పని చేసిన వరదాచార్యులును అప్పటి ఆంధ్రప్రదేశ్ సీఎం పీవీ నరసింహారావు 1972లో ఎమ్మెల్సీగా అవకాశమివ్వగా 1978 వరకు పని చేశారు. చెన్నూర్‌లో వేదపాఠశాల ఏర్పాటు చేసి అధ్యక్షునిగా పని చేశారు. 31 అక్టోబర్ 1984లో ఆయన తుదిశ్వాస విడిచారు.

కవి ప్రస్థానంలో..

చెన్నూర్ పట్టణానికి చెందిన వానమామలై వరదాచార్యుల 50 ఏళ్ల కవి ప్రస్థానంలో ఎన్నో రచనలు చేశారు. అభినవ పోతన, అభినవ కాళిదాసు, ఆంధ్రకవి, వసంత, మధుకవి, కవికోయిల, ఉత్ప్రేక్షా చక్రవర్తి, మహాకవి శిరోమణి, కవిశిరోవసంత లాంటి బిరుదులు పొందారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్నారు. షష్టిపూర్తి సందర్భంగా భారతీ సాహిత్య సమితి కరీంనగర్ జిల్లా కోరుట్లలో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు గండపెండేరం, స్వర్ణకంకణం, రత్నాభిషేకం చేశారు. పూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం వారణాసి వారు విద్యావాచస్పతి (డిలిట్) గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఇలా అనేక రాష్ట్రాల్లో మరెన్నో సన్మానాలు, సత్కారాలు అందుకున్నారు. ఆయన అనేక రచనలు ముద్రితం కాగా, కొన్ని ముద్రణకు నోచుకోలేదు.